


చదువుతున్న పేపరు మడచి బల్ల మీద పెట్టి లేచినుంచుని, "ఎవరూ?" అన్నారు గోపాలం.

బైట తలుపు మీద తడుతున్నచప్పుడు ఆగిపోయింది.

గోపాలం బైటకు వచ్చి తలుపుతీశాడు. వరండాలో లైటువెలుగు తలుపుతీసిన మేరా పరుచుకుంది. గోపాలం బైట నుంచున్నవ్యక్తిని పరీక్షగా చూశాడు.

"గోపాలంగారిల్లు ఇదేనాండీ?" చీకట్లో నుంచున్న ఆకుర్రాడు ముందుకు వచ్చి అడిగాడు. ఆకుర్రాడికి పదహారేళ్లుఉంటా యెమో. ఎర్రగా, సన్నగా ఉన్నాడు. బఫ్ కొట్టిన క్రాపు.

"ఇదే. ఎవరుకావాలి?" అడిగాడు గోపాలం.

"గోపాలం గారు."

"నేనే గోపాలాన్ని."

"మీరేనా." అని రెండుక్షణాలు ఆగి "మీతో ఒకచిన్నివిషయం చెప్పాలండీ." అన్నాడాకుర్రాడు.

"నాతోనా?"

కుర్రాడు తలూపాడు.

"ఏమిటి?"

కుర్రాడు చెప్పబోయి ఆగిపోయాడు. పెదాలు ఒణుకుతున్నాయి.

"మీకు......... శ్రీను తెలుసా?" అని గోపాలం ముఖంలోకి పరీక్షగాచూశాడు.

"శ్రీను?"

"నల్లగా పొట్టిగా ఉంటాడు. స్ఫోటకం మచ్చలు............"

"ఓహ్! వాడా. తెలుసు.ఏం?"

"శ్రీను కారుక్రింద పడ్డాడు."

గోపాలం ఉలికిపడ్డాడు.

"మొన్నసాయంత్రం షాపునుండివస్తుంటే జరిగింది. అరగంట క్రిందటే స్పృహవచ్చింది. మిమ్మల్ని చూడాలంటున్నాడు."

గోపాలం చిన్నగానిట్టూర్చి తలుపుకు ఆనుకుని నుంచున్నాడు.

"మీరువస్తే .......... హాస్పిటల్‌కు తీసుకు వెడతాను."

"సరె. పద."

గోపాలం ఇంట్లోకివెళ్లి గుడ్డలుమార్చుకుని తలుపుదగ్గరగా వేసి వరండాలోకి వచ్చాడు.

"అన్నపూర్ణా! తలుపులు వేసుకో. నేను బైటకువెడుతున్నాను. అరగంటలో వచ్చేస్తాను." భార్యనుద్దేశించి అని మెట్లు దిగాడు.

చల్లటిగాలివీస్తోంది. వెన్నెలమసకమసకగా కురుస్తోంది. కచేరిలో కొడ్తున్న గంటలు గాలిలో తేలి వడిఆగిఆగి వినిపించాయి. ఇద్దరూ ప్రక్క ప్రక్కగా నడుస్తున్నారు. బజార్లో కొట్లుఅప్పటికే కట్టివేశారు. గోపాలం సిగరెట్‌వెలిగించాడు. కాలర్‌పైకిలాగి మెడనిండా కప్పుకున్నాడు. కుర్రాడివంకచూచాడు. కుర్రాడు తలవంచుకుని రోడుమీదున్న చిన్న రేకుముక్కను తన్నుతూ నడుస్తున్నాడు.

"నీపేరూ?" అడిగాడుగోపాలం.

కుర్రాడు తలెత్తి గోపాలంవంక చూశాడు.

"చిట్టి."

"ఏక్సిడెంటు ఎలా జరిగింది.?"

"నాకూసరిగా తెలియదు. శ్రీనుఉండేది మాఇంటి ప్రక్కనే. మొన్ననేను మేటనీకివెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి మా అమ్మచెప్పింది. మొన్నటినుంచి శ్రీను దగ్గరే ఉన్నాను. శ్రీను....... చాల మంచివాడండీ...

చిట్టిమాటల్లోని గాద్గదికం వలన మాటలు ఎక్కడికక్కడ తెగిపోతున్నాయి.

"దెబ్బలు బాగా తగిలాయా?"

"అలానే ఉందండీ. అసలు సంగతి హాస్పిటల్లో అడుగుతే ఎవరూ సరిగా చెప్పడంలేదు. రక్తంబాగా పోయిందంటున్నారు ఫర్వాలేదు. కోలుకోవచ్చు. అయినా చెప్పలేం.... అంటున్నారండీ...."చిట్టిగొంతు బొంగురుపోయింది. చెప్పేవాడల్లా ఆగి తలవంచుకుని నడవసాగాడు.

"చిట్టీ!"

చిట్టి తలెత్తలేదు.

"ఊఁ" అన్నాడు.

"శ్రీను వాళ్లవాళ్లు వచ్చారా?"

చిట్టి తలెత్తాడు.

"శ్రీనుకు ఎవరూ లేరండీ." అన్నాడు. ఆమాటలో బాధమెలికలుతిరిగింది. చిట్టి కళ్లల్లో నీరు తిరుగుతుంది. తిరిగి తల వంచుకున్నాడు.

గోపాలం సిగరెట్ రోడ్డుప్రక్క కాలవలోకి విసిరివేశాడు.

శ్రీనుకు పద్నాలుగు సంవత్సరాలుంటాయేమో, నల్లగా, పొట్టిగాఉంటాడు. ముఖంనిండా స్ఫోటకంమచ్చలు. తలకు తైలసంస్కారం నిత్యం ఉండదు. పెదాలు ఎప్పుడూ నవ్వుతూ ఉంటాయి. లోతుకుపోయిన అతని కళ్లల్లో విషాదం ద్యోతకమౌతుంటుంది. ఇంతకుముందు శ్రీనుప్రతిరోజూ గోపాలం ఇంటికి వస్తుండేవాడు. ఓ అరగంటసేపు ఉండి, వాళ్లింట్లో అన్నిపనులు అడిగినా అడగకపోయినాచేసి పెడుతుండేవాడు. శ్రీను వేసుకునేగుడ్డలు మట్టికొట్టుకుని మురికిగా ఉండేవి. శ్రీను అవతారం చూస్తే గోపాలానికి చెప్పలేని అసహ్యం వేసేది. చివరకు ఒకరోజు భార్యతో "వాణ్ణి మనింటికి రానీయకు." అన్నాడుగోపాలం.

"ఎవరిసంగతి మీరనేది?" అన్నది అన్నపూర్ణ.

"ఇంకెవరిసంగతి. వాడే—శ్రీను."

"ఎందుకు?"

"వాడి అవతారం చూస్తేనే డోకు వస్తుంది. దొంగ రాస్కెల్."

"దొంగపనులేమీ చేయలేదు కదా."

"చేస్తే............?"

"వాడు చేయడు. అటువంటివాడు కాడు."

గోపాలంకోపం మిన్నుముట్టింది. "అన్నపూర్ణా! వాడు మనింటికి రావడం నాకు సుతారమూ ఇష్టంలేదు. అంతే."అన్నాడు.

అన్నపూర్ణ భర్త ముఖంలోకి పరీక్షగా చూసింది. తిరిగి ఏదో అనబోయింది కాని, అనలేదు.

ఆమరుసటిరోజు శ్రీను వాళ్లింటికి వచ్చినప్పుడు అన్నపూర్ణకు ఆసంగతి ఎలా చెప్పాలో అర్థంకాలేదు. శ్రీను ఒక అర్ధ గంట కూర్చుని వెళ్లిపోతుంటే.

"శ్రీనూ" అన్నది అన్నపూర్ణ

శ్రీను ఆగి ఆమెముఖంలోకి చూశాడు.

"ఏమిటండీ."

కావాలని హృదయాన్ని కఠినంచేసుకోవడం కష్టమే. అన్నపూర్ణ రెండుక్షణాలు తటపటాయించింది. "రేపట్నుంచి మా ఇంటికి రాకురా." అన్నది మాటలు తడబడుతూంటే.

శ్రీను నిర్ఘాంతపోయాడు.

"నిజంరా."

శ్రీను తేరుకుని, "దేనికండీ"అన్నాడు.

"దేనికీలేదు.. నువు......ఏం లేదు..."

"నేనేంచేశానండీ?"

అన్నపూర్ణ తలవంచుకుంది. "నువ్వేమీ చేయలేదు. నువ్వు ఇక్కడికి రావడం నాకిష్టం లేదు. అంతే." అన్నది తలవంచుకునే.

శ్రీను తిరిగి మాట్లాడలేదు. తడబడే అడుగులతో మెట్లుదిగాడు. అన్నపూర్ణవంకచూసి రెండుచేతులూ జోడించి నమస్కరిస్తుంటే అతనికళ్లల్లో నీళ్లు జారిబుగ్గల మీదుగా కారిపోతున్నాయి. ఇల్లుదాటి రోడ్డుమీదికి వస్తూ వెనకకు తిరిగి చూడాలని అనిపించినా చూడలేదు. కుళ్లికుళ్లి ఏడుస్తున్న తనహృదయం ఆక్షణంలో ఆగిపోయినా బావుండు అనిపించింది శ్రీనుకు.

ఆతరువాత శ్రీను ఇంటికి ఎప్పుడూ రాలేదు. కాని, రోజూ మెకానిక్‌షాపుకు ఆదారినేవెడుతూ దూరంగా నుంచుని ఆఇంటివైపే రెండు నిమిషాల పాటు తదేకంగా చూసేవాడు.

అడుగుల చప్పుడు విని ముప్పైరెండో బెడ్‌మీద పండుకున్న శ్రీను కళ్లు మెల్లగా తెరిచాడు. ఎదురుగా గోపాలం, చిట్టి ప్రక్కప్రక్కగా నుంచున్నారు. శ్రీను లేవబోయి వీలుకాక బాధగా మూలిగి పండుకున్నాడు. తలదగ్గరనుండీ నడుంవరకు బేండేజితో నిండిపోయుంది.

గోపాలం ముందుకువంగి, "ఎలా ఉంది?" అడిగాడు.

"బాధగా ఉంది." అన్నాడు శ్రీను.

"వారం రోజుల్లో కోలుకుంటావులే". అన్నాడు గోపాలం.

శ్రీను పేలవంగా నవ్వి గోపాలం చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు.

"అన్నపూర్ణ అక్కయ్యగారు వచ్చారా?"

"రాలేదు."

శ్రీను గోపాలంచేతిని చిన్నగానొక్కి చేయివదిలాడు. కళ్లుమూసుకున్నాడు. కనుకొలుకుల్లో నీటిబిందువులు లైటు వెలుగులో మెరుస్తున్నాయి.

అంతలో నర్సు వచ్చి. "రెండునిమిషాలు బైటఉండండి. పెద్దడాక్టరుగారు రవుండ్స్‌కు వస్తున్నారు." అన్నది.

గోపాలం చిట్టి బైటకు వచ్చి వరండాలో నుంచున్నారు. గోపాలం సిగరెట్ వెలిగించి గోడకు ఆనుకుని నుంచున్నాడు. చిట్టి తోటలో క్రోటన్స్ మీద పడుతున్న వెలుగులోకి చూస్తుండిపోయాడు.

గోపాలం ఇంటికి తిరిగి వచ్చేసరికి పన్నెండు దాటింది.

అన్నపూర్ణ తలుపులుతీస్తూ, "ఎక్కడికి వెళ్లారు?" అడిగింది.

"హాస్పిటలుకు." అన్నాడు గోపాలం విసుగ్గా.

"ఎందుకు?"

గోపాలం మాట్లాడలేదు. నిద్రవముంచుకు వస్తుంది. గుడ్డలు మార్చుకుని కాళ్ళు కడుకున్నాడు. మంచంమీద పండుకున్నాడు. గదిలో బెడ్‌లైట్ నీలంగా వెలుగుతోంది.

గోపాలం భార్యవంక చూసి, "శ్రీను చచ్చిపోయాడు." అన్నాడు.

# నేనేం చేశాను?

అన్నపూర్ణ ఉలికిపడి గోపాలం ముఖంలోకి చూసింది.

"ఎప్పుడు?"

"అరగంట క్రిందట. మొన్నరాత్రి క్రింద పడ్డాడు. ఇందాకే చచ్చిపోయాడు."

అన్నపూర్ణ చాలసేపటివరకు మౌనంగా ఉండిపోయింది. చివరకు,

"వాళ్ల వాళ్లంతా వచ్చారా?" అడిగింది అన్నపూర్ణ.

"రావడానికి వాడికి ఎవరూ లేరు."

"మరి ..... కర్మకాండ, అంతా ఎవరు చూస్తారు?"

గోపాలం దుప్పటి ముఖంనిండా కప్పుకుంటూ "ఏమో" అన్నాడు.

* * *

ఉదయంనుండి వర్షం కుండపోతగా కురుస్తుంది.

ముప్ఫైరెండు నెంబరు బెడ్ మడచి వరండాలో వేస్తుంటే వల్లటి నిక్కరు క్రిందబడింది. వంగి అందుకున్నాడు తోటి నాగరాజు. నిక్కరు బాగా మాసిపోయి ఉంది. అక్కడక్కడా రక్తం మరకలున్నాయి. జేబు బరువుగా ఉంది. చేయి పెడితే చిన్న పుస్తకం దొరికింది. తెరిచాడు. మధ్యలో రెండురూపాయలకాయితం మడతపెట్టి భద్రంగా ఉంది. అటూ ఇటూ ఒకసారి చూసి అపుస్తకాన్ని తనజేబులో పెట్టుకున్నాడు నాగరాజు. వల్లనిక్కరు మడచి బెడ్‌క్రింద పెట్టాడు. వార్డులోనుండి బైటకువచ్చి వరండా చివరకు వచ్చాడు. జల్లు పడుతుంది. బీడీతీసి వెలిగించాడు. జేబులోంచి పుస్తకాన్ని తీశాడు. మొదటి పేజీలో శ్రీను అని వంకరటింకర అక్షరాలతో ఎర్రపెన్సిలుతో పెద్దగారాసి ఉంది. లోపలపేజీలలో ఏవోపద్దులు లెక్కలు ఉన్నాయి. మధ్యలో ఉన్నరెండు రూపాయల కాయితాన్ని తీసి తన చేతిలో మడతలో భద్రపరచుకున్నాడు నాగరాజు. ఇంకేమైనా ఉంటాయేమోనని పేజీలు అటునుండి ఇటు ఒకసారి తిప్పాడు. చివర్లో ఒకకాయితం మాసిపోయి, మడతలు పెట్టిఉంది. మడతలున్నచోట కాయితం చిరిగి పోయిఉంది. నాగరాజు ఆకాయితం మడతలు విప్పాడు. దానిమీద పెన్సిలుతో కుదరని అక్షరాలతో, కనిపించి కనిపించకుండా ఏదో రాసివుంది. ఆకాయితాన్ని డస్ట్‌బిన్‌లో పడవేయబోతూ ఆగి నాగరాజు చదివాడు.

"అన్నపూర్ణ అక్కయ్యగారికి, శ్రీను నమస్కరించి వ్రాయునది. నేను చాల దురదృష్టవంతుణ్ణి. నేను పుట్టకముందే మానాన్న చచ్చిపోయాడు. నన్ను కని అమ్మ చచ్చిపోయింది. నన్ను రాజ్యం అక్కయ్యే పెంచింది. అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయేమో, స్ఫోటకం వచ్చింది. ఆ జబ్బులో కంటికి రెప్పలా ప్రతిక్షణం నన్ను కని పెట్టుకుంది రాజ్యం అక్కయ్య. నేను బాగుపడ్డాను. కాని, రాజ్యం అక్కయ్యకు వెంటనే స్ఫోటకం వచ్చింది. అంతే అక్కయ్య కోలుకోలేదు. నన్ను ఏకాకిని చేసి వెళ్లిపోయింది. మిమ్మల్ని చూస్తుంటే రాజ్యం అక్కయ్య గుర్తుకు వస్తుంది. మీరు అచ్చం రాజ్యం అక్కయ్యలా ఉంటారు.అందుకనే అక్కయ్యా,మీ ఇంటికి నేనెప్పుడూ వచ్చేది! కాని నేనంటే మీకు అసహ్యం కదూ. అక్కయ్యా, నిజం చెప్పండి. నేనేం తప్పుచేశాను......."

ఆ తర్వాత అక్షరాలు కాయితం మడతలలో పడి, చిరిగి పోయి కనిపించడం లేదు. ●

